www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 17 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-151 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## నేడు ఎన్టీఆర్ స్టేడియంలో

# కెసిఆర్ సభ

## సభకు లక్షమంది వస్తారని పోలీసుల అంచనా

వజ్రోత్సవాలతో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఘనంగా తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు

టిఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గాల్లో ర్యాలీలు

హైదరాబాద్‌లో జెండా ఊపిని సిఎస్ సోమేశ్ కుమార్

ప్యారడైజ్ వద్ద పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

పలు ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొన్న మంత్రులు,ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మొదటి రోజు శుక్రవారం రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో దాదాపు 15వేల మందితో జాతీయ జెండాలు చేబూని ర్యాలీలు నిర్వహించి తెలంగాణ సమైక్యతను ఎలుగెత్తి చాటారు. ఈ ర్యాలీల్లో విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టీఆర్ఎస్ నేతలు అన్ని నియోజకవర్గాల్లో తెలంగాణ జాతీయ సమైక్యతా వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ర్యాలీని ప్రారంభించారు. అమీర్ పేట లోని కనకదుర్గమ్మ దేవాలయం నుండి బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. 2వ



2వ

## కవిత మెడకు ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఉచ్చు

కవితకు నోటీసులు అందించిన ఇడి

కవిత అకౌంటెంట్ ఇంట్లో ఇడి సోదాలు

గతంలో ఆమె పీఏ నివాసంలో ఈడీ సోదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కామ్ వ్యవహారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మెడకు కాస్త గట్టిగానే చుట్టుకునే అవకాశం కనిపిస్తోంది. సోదాలు మెల్లగా కవిత మనుషుల చుట్టూ తిరుగుతన్నాయి. గతంలో కవిత పీఏ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం కవిత అకౌంటెంట్ ఇంట్లో సోదాలు నిర్వహించింది. ఈ మేరకు కవితకు ఈడీ నోటీసులు పంపించింది. ప్రస్తుతం కరోనా సోకడంతో ఆమె క్వారంటైన్‌లో ఉండటంతో కవిత సహాయకులకు ఈడీ నోటీసులు అందజేసింది. ఈ కేసులో ఈడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్‌లో పలువురు వ్యాపార వేత్తలు చార్టెడ్ అకౌంట్ నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు

## అంబేద్కర్ దార్శనికత వల్లే తెలంగాణ



త్యాగాలతో సిద్ధించిన తెలంగాణను కాపాడుకోవాలి

కులమతాలతో విచ్ఛిన్నం కాకుండా చూడాలి

8ఏళ్ల తరవాత బిజెపికి తెలంగాణ ఇప్పడే గుర్తుకొచ్చిందా

అమిత్ షా రాకతో ఒరిగిందేమీ ఉండదు

మీడియాతో మంత్రి కెటిఆర్

2వ



## జయహో జగదీశ్ రెడ్డి

జిల్లా ఎస్పీ రాజేంద్ర నినాదాలు

**సూర్యాపేట, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మంత్రి జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ 'జయహో జగదీశ్ రెడ్డి' అంటూ నినాదాలు చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల్లో మంత్రి జగదీశ్ రెడ్డితో పాటు జిల్లా 2వ

## వజ్రోత్సవ వేడుకల్లో అపశృతి

ఎల్ఈడి స్క్రీన్ కిందపడి విద్యార్థులకు గాయాలు



**నల్గొండ, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** మిర్యాలగూడలో నిర్వహించిన తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. క్యాంప్ గ్రౌండ్ లో బహిరంగ సభ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ప్రమాదవశాత్తు కిందపడి పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. దీంతో గాయాలైన విద్యార్థులను పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై 2022 సెప్టెంబర్ 17 నాటికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా నేడు అన్ని జిల్లాల్లోనూ ర్యాలీలు నిర్వహిస్తున్నారు.



2వ

## టెన్నిస్‌లో ముగిసిన ఓ శకం

■ ఫెదరర్ నిష్క్రమణతో తరవాత ఎవరన్న బాధ

■ అతడి ఆటకు ఫిదా కాని వారు లేరు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** ప్రపంచ పురుషుల టెన్నిస్‌లో ఓ శకం ముగిసింది. తన అద్భుత ఆటతీరుతో, అసాధారణ ప్రదర్శనతో దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు టెన్నిస్ ప్రపంచాన్ని ఉర్రూత లూగించిన వీరుడు రాకెట్ వదిలేయనున్నట్లు చేసిన ప్రకటన అభిమానుకలు చేదు గుళికే. మొన్నటికిమొన్న సెరీనా వైరాగ్యం ప్రకటించి ఆటకు వీడ్కోలు పలికింది. 24 ఏళ్ల పాటు



## కృష్ణంరాజు కుటుంబానికి రాజ్‌నాథ్ పరామర్శ

రాజ్‌నాథ్‌కు స్వాగతం పలికిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** ఇటీవల అనారోగ్యంతో మరణించిన దిగ్గజ నటుడు, మాజీ కేంద్ర మంత్రి కృష్ణంరాజు కుటుంబాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు భార్య, పిల్లులు, హీరో ప్రభాస్‌ను కేంద్రమంత్రి ఓదార్చారు. ఫిల్మ్‌నగర్‌లో జరిగే కృష్ణంరాజు సంస్మరణ సభలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొననున్నారు. సాయంత్రం కేంద్రమంత్రి ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. రాజ్‌నాథ్ వెంట కిషన్ రెడ్డి , లక్ష్మణ్ , చింతల రామచంద్రారెడ్డితదితరులు ఉన్నారు. అంతకుముందు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయనకు కేంద్రమంత్రి కిషన్ 2వ

## సంపాదకీయం

# ఎట్టకేలకు తెలంగాణ విమోచనకు మోక్షం !

ఎట్టకేలకు తెలంగాణ విమోచనోత్సవాలకు మోక్షం దక్కింది. అటు కేంద్రం ఇటు రాష్ట్రం వేర్వేరుగా... వేర్వేరు పేర్లతో ఉత్సవాలను నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పుకోవాలి. నిజానికి ఇందులో సిగ్గు పడాల్సిన, భయపడాల్సిన పనిలేదు. నిజాం రాజరికం కనుమరుగు చేస్తూ భారత్‌లో విలీనమైన సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరుపుకోవడం నేటివరకు అధికారికంగా జరగలేదు. కేవలం మహారాష్ట్ర, కర్నాటకలో మాత్రమే ఈ ఉత్సవాలు జరిపేవారు. అనూహ్యంగా కేంద్రం విమోచనోత్సవాలు జరపాలని నిర్ణయిం తీసుకోవడంతో తెలంగాణ ప్రభుత్వం కూడా దిగిరాక తప్పలేదు. ఎంఐఎ కూడా అనూహ్యంగా ఇందుకు ముందుకు రావడం గమనార్హం. ఈ క్రమంలో జాతీయ సమైకత్యా వజ్రోత్సవాల పేరుతో సిఎం కెసిఆర్ మూడ్రోజుల ఉత్సవాలకు ఆదేశించారు. కానీ విమోచనోత్సవాలు అని నిర్వహిం చడం లేదు. కేంద్రం మాత్రం సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో విమోచనోత్సవాలకు శ్రీకారం చుట్టింది. దీంతో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఉత్సవాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాజెండా ఎగురేయబోతు న్నారు. నిజానికి తెలంగాణ విముక్తి కోసం ఎందరో పోరాడారు. ఎందరో మహిళలు తమ మాన,ప్రాణాలను పోగట్టుకున్నారు. రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలయ్యారు. సర్వస్వాన్ని త్యాగం చేసిన కొమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, నారాయ ణరావ్ పవార్, దొడ్డి కొమురయ్య, చిట్యాల ఐలమ్మ, దాశరథి సోదరులు, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ఎందరో మహానుభావులను స్మరించుకునేందుకు ఇదొక సరైన సమయం. అలాగే ఎందరో పోరాట యోధులను గురించి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. త్యాగాలను తర్వాతి తరాలకు అందజే సేలా చరిత్రను అందుబాటులోకి తీసుకుని రావాలి. పాఠ్యాంశాలుగా ముద్రించాలి. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకోలేక పోవడానికి పూర్తిగా రాజకీయ దివాళాకోరుతనం తప్ప మరోటి కాదు. ఘనమైన తెలంగాణ చరిత్రను మరుగున పడేసే ప్రయత్నాలు సరికాదు. మొత్తంగా తెలంగాణ విమోచన జరిగిన 75 ఏళ్లకు గానీ ఉత్సవాలకు మోక్షం జరగలేదు. ఏటా విమోచనోత్సవంపై జోరుగా వాదప్రతివాదనలు, విమర్శలు సాగుతుండేవి. అయినా 8 ఏళ్ల తెలంగాణలో కూడా విమోచనోత్సవాలకు మోక్షం దక్కలేదు. ఈ ఉత్సవాలు జరపాలంటేనే ఎందుకనో తెలంగాణ పాలకులు విముఖత చూపుతూ వచ్చారు. తెలంగాణకు ముందు విమోచనోత్సవాలకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తప్పమరోటి జరిగేది కాదు. బ్రిటిష్ వలసవాదం నుంచి మనకు విముక్తి లభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారతదేశం స్వాతంత్ర్య అమృత మహోత్స వాలను ఘనంగా జరుపుతున్నారు. భారతదేశం ఆంగ్లేయుల పాలన నుంచి ఆగస్టు 15, 1947న స్వతంత్ర మైనప్పటికీ నాటి హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇంకా విముక్తి పొందలేదు. స్వేచ్ఛావాయువులు పీల్చేం దుకు దాదాపు 13 నెలలు పట్టింది. ఉక్కు మనిషి, నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేకమైన చొరవతీసుకుని హైదరాబాద్‌పై పోలీసు చర్యకు ఉపక్రమించడం ద్వారా హైదరాబాద్ సంస్థా నాన్ని భారత్‌లో విలీనం చేశారు. ఈ కారణంగా నిజాం అరాచక పాలననుంచి ప్రజలకు విమోచన లభించిం ది. తెలంగాణలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకునేందుకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 75 ఏళ్లు పట్టింది. ఇది అత్యంత దౌర్భాగ్యకరమైన, సిగ్గు పడాల్సిన పరిస్థితి. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ఈ ఉత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిశ్చయించడం, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాని ముఖ్య అతిథిగా, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులను విశిష్ట అతిథులుగా ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. నిజానికి రాజకార్ల దాష్టీకం అంతాఇంతా కాదు. దీనిని చరిత్రగతం చేయాల్సి ఉంది. దీనిని మరుగున పడేలా చేశారే తప్ప చరిత్రగా లిఖించలేదు. హైదరాబాద్ సంస్థానంలో అరాచకాన్ని సృష్టించిన ఖాసీం రజ్వీ, లక్షా 50వేల మంది రజాకార్ సైన్యాన్ని ఏర్పాటుచేసి గ్రామాల్లో విధ్వంసం, అరాచకం, దోపిడీ, హత్యాకాండ చేయడం, మహిళలపై అత్యాచారాలు, పురుషులను చంపడం వంటివన్నీ జరిగాయి. దీనిని తెలియచేయడం ఏదో మతానికి వ్యతిరేకం ఎలా అవుతుందో పాలకులు చెప్పాలి. బ్రిటిషర్లు, అంతుకుముందున్న పాలకులు, దేశ విభజన సమయంలోనూ జరిగాయి. ఇవన్నీ తెలుసుకుంటేనే మన చరిత్ర సంపూర్ణం కాగలదు. చరిత్రను విస్మరించిన జాతి లేదా దేశం ముందడుగేయడం కష్టం. బైరాన్‌పల్లి, పరకాల ఘటనలను ఎలా మరచిపోగలం. బైరాన్‌పల్లి ఘటనకు ఇప్పటికీ అక్కడి బురుజులు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందలమందిని నిలబెట్టి రజాకార్లు పిట్టలను కాల్చినట్లు కాల్చారు. ఆ గ్రామాన్ని లూటీ చేసి తమ వికృతరూపాన్ని ప్రదర్శించారు. వరంగల్ జిల్లాలోని పరకాల ప్రజలు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని త్రివర్ణ పతాకాన్ని ఎగరేస్తే నిజాం, రజాకార్లు జీర్ణించుకోలేక హత్యాకాండకు పాల్పడిన చరిత్ర నేటి యువతకు తెలవాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరికీ నిజాం పాలనలోని వాస్తవాలను తెలియజేస్తూ, వారి అరాచక పాలన నుంచి విమోచనం కోసం మన పెద్దలు చేసిన పోరాటాన్ని వివరించాలి. ఆనాటి పోరాటాలను స్మరిస్తూ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాల్సి ఉంది. తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సిన అవసరం గురించి ప్రజలకు తెలియపరచాలి. మొత్తంగా ఇప్పుడు విమోచన ఉత్సవాలు ఏదో రూపంలో జరుపుకోవడం ఆనందించదగ్గ విషయం. తెలంగాణచరిత్ర దేశానికి మొత్తంగా తెలియాలి. ఇక్కడ జరిగిన పోరాటల గురించి తెలియాలి. ఏటా ఉత్సవాలు నిర్వహిస్తూ ఈ పోరాటలను ప్రజల్లోకి తీసుకుని పోవాలి. అప్పుడు పోరాటవీరుల త్యాగాలకు గుర్తింపు దక్కుతుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఇంత కాలం మాయమాట లతో మభ్య పెట్టారు



- ఇప్పటికైనా చరిత్రను నేటి తరానికి తెలియచేయాలి
- తెలంగాణ విమోచనను ఏటా నిర్వహించుకోవాలి: బిజెపి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** సెప్టెంబర్ 17ను విమోచన దినంగా జరుపుకోవడం నిజాంను అవమానించడం అవుతుందని, ఇది ముస్లిం సమాజానికి ఆగ్రహం కలిగిస్తుందని కొందరు మాయమాటలు చెబుతూ వచ్చారని,ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదని మాజీ ఎమ్మెల్సీ, బిజెపి నేత రామచంద్రారవు అన్నారు. సంతుష్టీకరణ చర్యలు తారస్థాయికి చేరుకున్నాయనడానికి కూడా ఇదో నిదర్శనమని అన్నారు. ఉమ్మడి ఎపిలో పాలకలు తీరులోనే కెసిఆర్ 8 ఏళ్లుగా వ్యవహరించారు తప్ప తెలంగాణ వ్యక్తిలాగా వ్యవహరించలేదన్నారు. తెలంగాణ విమోచన దినాన్ని మరచిపోయి మాట్లాడుతున్న వారు గతంలో ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకుంటే మంచిదని రామచంద్రరావు అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో విమోనోత్సవాలను జరపాలని డిమాండ్ చేసిన వారు, అధికారంలోకి రాగానే మాట మార్చడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వరకు ఉద్యమాలు చేపట్టామని అన్నారు. చివరకు కేంద్రం ముందుకు నావడంతో విధిలేకనే కెసిఆర్ ఉత్సవాల నిర్వహణకు ముందుకు వచ్చారని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరుల త్యాగాలు వృథా అవుతున్నాయని, వాటి గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరముందని చెప్పారు. అమరుల జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా చేసి నేటి యువతకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. అధికారంలోకి రాగానే విమోచనా దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్న సీఎం కేసీఆర్ మజ్లిస్ పార్టీకి భయపడి మాట మార్చారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. ప్రజలను చెట్టుకు కట్టేసి కాల్చడం, మహిళలపై అత్యాచారాలు చేసి బంగారాన్ని, ధనం, ధాన్యాన్ని లూటీ చేయడం వంటి ఘటనలు, రజాకార్ల ఆకృత్యాల గురించి నేటి తరానికి తెలియాల్సి ఉందన్నారు. నిర్మల్‌లో ఆ ప్రాంతంలో నిజాం రాక్షస పాలనకు అడుగడుగునా అడ్డుపడుతున్న రాంజీ గోండు, ఆయన అనుచరులు వెయ్యిమందిని మర్రి చెట్టుకు ఉరితీసిన నిజాం దుర్మార్గాల గురించి కూడా తెలంగాణ భవిష్యత్తయిన విద్యార్థులకు తెలవాల్సిన అవసరం ఉందన్నారు.అందుకే నాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాల ద్వారా చరిత్రను తెలియచేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయి ఎనిమిది సంవత్సరాలు గడిచినా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకునేందుకు ఇష్టపడటం లేదు. ఇతర రాజకీయ పార్టీలు కూడా విమోచన దినాన్ని జరుపుకునే విషయంలో అర్థంలేని ప్రకటనలు చేస్తున్నాయి. నిజాంకు వ్యతిరేకంగా చాలా మంది ముస్లింలు కూడా పోరాడారని అన్నారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు 'ఆమ్రోజ్' పత్రికను స్థాపించి, నిజాం కంటిమీద కునుకులేకుండా చేసిన షోయబు ల్లాఖాన్‌ను రజాకార్లే క్రూరాతిక్రూరంగా చంపించిన సంగతిని మనం గుర్తుచేసుకోవాలన్నారు.. విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా కుల, మతాలకు అతీతంగా నిజాం, రజాకార్లపై పోరాటం చేసిన వీరులందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని రామచంద్రరావు అన్నారు. వీరందరి కృషి కారణంగానే తెలంగాణ, భారతదేశంలో విలీనమైంది. మన గడ్డమీద త్రివర్ణపతాకం ఎగిరింది. మనకు స్వేచ్ఛ, స్వాతం త్ర్యాలు లభించాయన్నారు. ఇప్పటికైనా బానిసత్వపు ఆలోచనలను విడనాడి మన వాస్తవ చరిత్రను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో ముందుకు కదలాలని అన్నారు. 1948లో నాటి హోంమంత్రి సర్దార్ పటేల్ హైదరాబాద్ వేదికగా జాతీయ పతాకాన్ని ఎగరేసిన 74 ఏళ్ల తర్వాత మళ్లీ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విమోచన ఉత్సవాలను చేపట్టడం జరిగింది. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రస్తుత హోంమంత్రి అమిత్ షా త్రివర్ణ పతాకాన్ని ఇక్కడే ఎగురవేయనున్నారు. ఈ కార్యక్రమం మన గతాన్ని స్మరించుకుంటూ పోరాటయోధుల స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన అవసరాన్ని మనకు గుర్తుచేస్తుందని అన్నారు.

# కృష్ణంరాజు కుటుంబానికి రాజ్‌నాథ్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి) రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి ఘన స్వాగతం పలికారు. రాజ్ నాథ్ సింగ్ కు శాలువా కప్పి వివేక్ సన్మానించారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ లోని కృష్ణంరాజు ఇంటికి రాజ్ నాథ్ సింగ్ చేరుకున్నారు. రాజ్ నాథ్ వెంట బీజేపీ నేతలు లక్ష్మణ్, చింతల రామచంద్రా రెడ్డి ఉన్నారు. అక్కడి నుంచి 3 గంటలకు జేఆర్సీ కన్వెన్షన్ కు రాజ్ నాథ్ వెళ్లి.. కృష్ణంరాజు సంతాప సభలో ప్రసంగిస్తారు.కృష్ణంరాజు సినిమాలతో పాటు రాజకీయాల్లో కూడా కొనసాగారు. బీజేపీ హయాంలో కేంద్ర మంత్రిగా పని చేశారు. ఆ పార్టీకి సంబంధించిన నేతలతో మంచి సంబంధాలున్నాయి. 66 ఏళ్లకు పైగా తెలుగు సినీ ఇండస్ట్రీలో రారాజుగా వెలిగారు. సెప్టెంబర్ 11వ తేదీన అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. ఆయన మృతితో సినీలోకం దిగ్భ్రాంతికి గురైంది. కుటుంబసభ్యులతో పాటు సినీ, రాజకీయ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు ఘనంగా నివాళు లర్పించారు.

# జయహో జగదీశ్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి) ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ కూడా హాజరయ్యారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... సభకు హాజరైన ప్రతి ఒక్కరూ మంత్రి జగదీశ్ రెడ్డికి ఓ బహుమతిని ఇవ్వాలని కోరారు. ఆకలేస్తే కేకలేయాలని ప్రముఖ కవి శ్రీశ్రీ అన్నారని చెప్పారు. సభకు వచ్చిన తాను ఇచ్చే నినాదాలతో స్వరం కలపాలన్నారు. మంత్రి జగదీష్ రెడ్డిని ఉద్దేశిస్తూ 'జయహో జగదీశ్ రెడ్డి' అంటూ సభకు వచ్చిన వారితో నినాదాలు చేయించారు. అంతే కాకుండా మంత్రి జగదీశ్ రెడ్డిని బాహుబలి అంటూ ఎస్పీ సంబోధించారు. దీంతో సభకు వచ్చిన వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఎస్పీ అలా నినాదాలు ఇస్తున్నప్పుడు మంత్రి జగదీశ్ రెడ్డి స్టేజీపైనే ఉండడం గమనార్హం. మంత్రితో సహా ఏ ఒక్క అధికారి కూడా నినాదాలిస్తున్నప్పుడు ఎస్పీని వారించలేదు. ఓ జిల్లా స్థాయి అధికారిగా ఉండి ఎస్పీ ఈ విధంగా నినాదాలు ఇవ్వడమేంటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కవిత మెడకు ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఉచ్చు



(మొదటి పేజీ తరువాయి) నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్సీ కవిత పర్సనల్ ఆడిటర్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లోని దోమలగూడ లోని అరవింద్ నగర్ శ్రీ సాయికృష్ణ రెసిడెన్సీలో కవిత ఆడిటర్ నివాసముంటున్నారు. నలుగురు ఈడీ అధికారుల నేతృత్వంలో సాయి కృష్ణా రెసిడెన్సీలోని మొదటి అంతస్తులో చార్‌టెడ్ అకౌంటెంట్ గోరంట్ల బుచ్చిబాబు నివాసంలో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. బుచ్చిబాబు గతంలో కవితకు అకౌంటెంట్‌గా ఉన్నారు. అలాగే.. గచ్చిబౌలిలో అభినవ్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. కాగా.. గతంలోనూ ఎమ్మెల్సీ కవిత పీఏగా పనిచేస్తున్న అభిషేక్ రావు ఇంట్లో కూడా ఈడీ సోదాలు నిర్వహించడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా.. దేశవ్యాప్తంగా 40కి పైగా ప్రాంతాల్లో ఈడీ దాడులు నిర్వహిస్తోంది. ఢిల్లీ, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో 25 బృందాలతో ఈడీ తనిఖీలు చేపట్టింది. అభినవ్‌రెడ్డి, అభిషేక్, ప్రేమ్‌సాగర్‌రావు, అరుణ్ పిళ్ళై ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, కోకాపేట, దోమలగూడలో తనిఖీలు నిర్వహించారు. ఇందిరాపార్క్ దగ్గర శ్రీసాయికృష్ణ రెసిడెన్సీలో ఈడీ సోదాలు చేపట్టింది.

# టెన్నిస్‌లో ముగిసిన ఓ శకం



(మొదటి పేజీ తరువాయి) సుదీర్ఘంగా సాగిన తన కెరీర్‌కు తెరదించుతూ.. 41 ఏళ్ల వయసులో రోజర్ ఫెదరర్ ప్రొఫెషనల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలికాడు. కళ్లు చెదిరే ఆ ఫోర్‌హ్యాండ్ షాట్లు, ఆహా అనిపించే ఆ ఒంటి చేతి బ్యాక్ హ్యాండ్ షాట్లు, మంత్రముగ్దుల్ని చేసే ఆ సర్వీసులు, ప్రత్యర్థిని బోల్తా కొట్టించే ఆ డ్రాప్‌లు.. ఇక జ్ఞాపకాలే. ఓ శకం ముగిసింది. కళాత్మక షాట్లతో ఆటకు అందాన్నద్ది.. అద్వితీయ ఆటతో టెన్నిస్ ప్రాచుర్యాన్ని పెంచి, హుందాతనంతో ఆకట్టుకుని.. రెండు దశాబ్దాలకుపైగా క్రీడాభిమానులను అలరించిన స్విస్ దిగ్గజం 'రోజర్ ఫెదరర్' ఆటకు గుడ్‌బై చెప్పేశాడు. 20 విజయాలతో పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్న ఫెదరర్ గురువారం రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే వారం లండన్‌లో జరిగే లేవర్ కప్ తనకు చివరి టోర్నీ అని వెల్లడించాడు. తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ట్విటర్‌లో లేఖను పోస్టు చేశాడు. ఇన్నేళ్లుగా టెన్నిస్ నాకిచ్చిన గొప్ప బహుమతి.. ఈ ప్రయాణంలో నేను కలిసిన వ్యక్తులే. నా స్నేహితులు, ప్రత్యర్థులు, అభిమానులు ఆటకు ప్రాణం పోశారని అన్నాడు.ఫెదరర్ ప్రస్తావన రాగానే అభిమానుల్లో ఓ రకమైన అభిమాన్ స్ఫురించేది. టెన్నిస్ చరిత్రలో మేటి ఆటగాడెవరన్న దానిపై భిన్నాభిప్రాయాలుండొచ్చు. ఎవరు గొప్పన్న దానిపై ఏకాభిప్రాయం ఉండకపోవచ్చు. అయితే చూడముచ్చటైన ఆట ఎవరిదంటే మాత్రం చర్చ ఫెదరర్ దగ్గరే మొదలై ఫెదరర్ దగ్గరే ఆగిపోతుంది. వివాదానికి తావే లేదు. బోర్గ్, ఎమర్సన్, సంప్రాస్, నాదల్, జకోవిచ్ లాంటి స్టార్లు పోటీలో వెనుకే. తన కళాత్మక ఆటతో, హుందాతనంతో అభిమానుల మనసులపై అంత బలమైన ముద్ర వేశాడు రోజర్. దూకుడుకు అందాన్ని జోడించిన అతడి ఆటను చూడడానికి రెండు కళ్లూ చాలవు. గత మూడేళ్లుగా గాయాలు, శస్త్రచికిత్సలు సవాలు విసిరాయని తెలిపాడు.తిరిగి పూర్తి స్థాయి పోటీతత్వంతో ఆటలోకి తిరిగొద్దామనుకున్నా. కానీ నా శరీరం సామర్థ్యం, పరిమితులు నాకు తెలుసు. అది నాకు ఆలస్యంగా ఓ సందేశం పంపింది. నాకిప్పుడు 41 ఏళ్లు. 24 ఏళ్లకు పైగా 1500 మ్యాచ్‌ల కంటే ఎక్కువ ఆడా. నా కల కంటే టెన్నిస్ నాకెంతో ఇచ్చింది. వచ్చే వారం లండన్‌లో ఆడే లేవర్ కప్ నా చివరి ఏటీపీ టోర్నీ. భవిష్యత్‌లో టెన్నిస్ ఆడతా. కానీ గ్రాండ్‌స్లామ్ లేదా టూర్ టోర్నీల్లో పాల్గొనను. ఇదో చేదు తీపి కలగలిసిన నిర్ణయం. నాతో ప్రతి నిమిషాన్ని గడిపిన నా భార్య మిర్కాకు ధన్యవాదాలు. గత 24 ఏళ్లు 24 గంటలుగా అనిపిస్తోంది. మరోవైపు పూర్తి జీవితాన్ని గడిపేశానని పిస్తోందని అందులో ఫెదరర్ పేర్కొన్నాడు. నంబర్‌వన్ ఆటగాడిగా అయిదు సీజన్లను ముగించిన అతను.. గత కొన్నేళ్లుగా మోకాలి గాయం, శస్త్రచికిత్సలతో ఆటకు దూరమవుతూ వచ్చాడు. ఇంపైన ఆటతో దాదాపు పాతికేళ్లు.. ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను అలరించాడు ఫెదరర్. వేగం, నియంత్రణ, సహనం, చురుకుదనం.. ఇలా స్విస్ యోధుణ్ని దిగ్గజాన్ని చేసిన లక్షణాలెన్నో. అందరూ ఆడే షాట్లే అయినా ప్రతి షాట్లోనూ తనదైన శైలిని చొప్పించాడతడు. ఏ షాట్ అయినా అలవోకగా ఆడగల సామర్థ్యం అతడి సొంతం.అయితే ఫెదరర్ అమ్ములపొదిలో ఎన్నో అస్త్రాలున్నా ముందు గుర్తొచ్చేది అతడి అద్వియతీమైన ఫోర్ హ్యాండే. చిరుతలా కదిలి ఎంత కచ్చితంగా, అలవోకగా షాట్ కొడతాడో! ప్రత్యర్థులు బెంబేలెత్తాల్సిందే. తన పాదాలను కోర్టుకు రెండు అంగుళాలు పైకి లేపుతూ.. మణికట్టును తిప్పుతూ అతడు ఆడే ఈ షాట్ ఎంత తృప్తినిస్తుందో మాటల్లో చెప్పలేం. స్లైస్, స్మాష్, ఇన్‌సైడ్ ఔట్, డ్రాప్ షాట్.. ఇలా ఫోర్ హ్యాండ్‌తో అతడు చేసే మాయలెన్నో.కానీ ఎలా ఆడినా, ఎప్పుడు ఆడినా ఆ అందం మాత్రం పోదు. కచ్చితంగా అనుకున్న చోట బంతిని కొట్టగల నైపుణ్యం అతడి సొంతం. ప్రత్యర్థులు అయోమయానికి గురికావడం చాలా సాధారణ విషయం.



# అంబేద్కర్ దార్శనికత వల్లే తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి) **రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** అంబేద్కర్ దార్శనికత వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని కేటీఆర్ తెలిపారు. ఎంతో మంది త్యాగాలతో సిద్ధించిన తెలంగాణను కులం, మతం పేరుతో విచ్ఛిన్నం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ సమైక్యంగా ఉండాలనే సమైక్యత వేడుకలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ వజ్రోత్సవ వేడుకల్లో కెటిఆర్ పాల్గొన్నారు. సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా నిర్వహిస్తున్న బీజేపీపై మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 8 ఏళ్లుగా గుర్తుకురాని సెప్టెంబర్ 17 ఈరోజే గుర్తొచ్చిందా అని మండిపడ్డారు. కేంద్రమంత్రి అమిత్ షా వస్తే.. ఓ పది వేల కోట్లు అయినా తెచ్చే దమ్ముందా అని అన్నారు. దున్నపోతు మీద వాన పడ్డట్లే ఉంది.. బీజేపీ నేతల తీరు అని వ్యాఖ్యలు చేశారు. నాలుగు ఓట్ల కోసమే చిల్లర గాళ్ల లొల్లి అని అన్నారు. పాత గాయాలను గెలకడమే బీజేపీ లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత తెలంగాణ లో కులం, మతం పేరుతో చిచ్చు పెడుతున్నారన్నారు. మత పిచ్చితో తెలంగాణను విడదీయాలని అనుకుంటున్నారని ఆరోపించారు. దుర్మార్గపు, అరాచకపు వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిచ్చి మాటలు, పనికి మాలిన ముచ్చట్లు తప్ప ఏమీ చేయడం లేదన్నారు. హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెట్టే చిల్లర నాయకులను నమ్మొద్దని మంత్రి కేటీఆర్ అన్నారు. మతపిచ్చి, వైషమ్యాల మాయలో పడితే తెలంగాణ దశాబ్దాల వెనుకబాటుకు వెళుతుందన్నారు. చిల్లర మాటలు, పంచాయితీలతో తెలంగాణకు ఒరిగేదేమీ ఉండదని కేటీఆర్ స్పష్టం చేశారు. భారత్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజును గుర్తు చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. త్యాగధనులను స్మరించుకుంటూ ఈ వేడుకలను నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. తెలంగాణకు పోరాటాలు కొత్త కాదన్నారు. 1948లో రాచరిక ప్రభువుపై, 1956లో ఆంధ్రాలో విలీనమైనప్పుడు, 1960 దశకంలో తెలంగాణ కోసం, 2001లో కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ కోసం పోరాటం జరిగి లక్ష్యాన్ని ముద్దాడిందని గుర్తు చేశారు. తెలంగాణ సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత సంక్షేమానికి రాష్ట్రం ట్రేడ్ మార్క్‌గా నిలిచిందన్నారు. జిల్లాలో 85 నుంచి 90 శాతం కుటుంబాలకు పెన్షన్ అందుతుందన్నారు. సిరిసిల్ల జిల్లాకు కొత్తగా 17 వేల పెన్షన్‌లు మంజూరు చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. కరెంట్, నీళ్ల వ్యవస్థ కూడా మెరుగు పడిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యక్రమాలు జిల్లాలో చేపడుతున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో ఒక్కటే డిగ్రీ కాలేజీ ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు జిల్లాలో వ్యవసాయ, పాలిటెక్నిక్ కళాశాల సహా అనేక కళాశాలలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. త్వరలో మెడికల్ కళాశాల కూడా రానుందని కేటీఆర్ చెప్పారు.

# నేడు ఎన్టీఆర్ స్టేడియంలో కెసిఆర్ సభ

(మొదటి పేజీ తరువాయి) మరోవైపు ఐమ్యాక్స్ చౌరస్తా నుంచి పీపుల్స్ ఎలాజా వరకు గ్రేటర్ టీఆర్ఎస్ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ సోమేశ్ కుమార్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంబించారు. ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు భారీగా పాల్గొన్నారు. నగరంలో తెలంగాణ జాతీయ సమైక్యతా వేడుకలకు హోంమంత్రి మహ్మద్ అలీతో పాటు, మంత్రి తలసాని, ఎమ్మెల్యే దానం నాగేందర్ హాజరయ్యారు. రాష్ట్రంలో తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిన తెలంగాణ... 75వ వసంతంలోకి అడుగు పెడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ వేడుకలను ఏడాదిపాటు నిర్వహిస్తోంది. మూడురోజులపాటు ప్రారంభ కార్యక్రమాలు జరగనుండగా 17నతెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవంగా పాటిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. తెలంగాణ ప్రాంతం రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యవ్యవస్థలోకి వచ్చి రేపటితో 74 ఏళ్లు పూర్తి అవుతోంది. 75వ వసంతంలోకి అడుగిడుతున్న వేళ తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల పేరిట ఏడాదిపాటు ఘనంగా వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా నేటి నేటి నుంచి మూడు రోజుల పాటు వజ్రోత్సవ ప్రారంభ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో... భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, యువతీ యువకులు, మహిళలను భాగస్వామ్యం చేశారు. జాతీయజెండాల్ని చేతబూని ర్యాలీలు నిర్వహిస్తున్నారు. చారిత్రక సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ జాతీయ సమైక్యతా దినంగా పాటించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ సెంట్రల్ లాన్స్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించి ప్రసంగిస్తారు. తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల్లో భాగంగా... సికింద్రాబాద్‌లో ర్యాలీ చేపట్టారు. ప్యారడైజ్ నుంచి గాంధీ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీని... మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. జాతీయజెండా పట్టుకుని ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు. రాచరికం నుంచి... ప్రజాస్వామ్యంలోకి వచ్చి 75 వసంతాలు పూర్తికావడంతో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ హరీశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆ ప్రదర్శనను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. కూకట్‌పల్లి నుంచి దయర్‌గూడలోని అంబేద్కర్ విగ్రహం వద్దకి ప్రదర్శన చేపట్టారు. ఆ కార్యక్రమంలో వివిధ కళాశాల విద్యార్థులతోపాటు కలిసి పలువురు అధికారులు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే వివేకానంద ఆధ్వరంలో నిర్వహించిన తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల ర్యాలీకి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చందానగర్ పీజేఆర్ స్టేడియం వరకు చేపట్టిన ర్యాలీకి ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం పాతబస్టాండ్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీనీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంబేడ్కర్ పేరు పెట్టడంపై సాయిచంద్ ఆనందం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** తెలంగాణ నూతన సచివాలయానికి డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ పేరును ప్రకటించడంతో... రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, కళాకారుడు సాయిచంద్ నృత్యాలు చేస్తూ.. హైదరాబాద్‌లో సందడి చేశారు. ట్యాంక్ బండ్ పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెడతామని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. డప్పుచప్పుళ్లు... లంబాడీల నృత్యాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాన్ని చేతపట్టుకొని చైర్మన్ నృత్యాలు చేశారు. నూతన పార్లమెంటు భవనానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టాలని అసెంబ్లీ లో తీర్మానం చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు.

## సిఎం కెసిఆర్‌తో వాఘేలా భేటీ


**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** తెలంగాణ సీఎం కేసీఆర్ తో గుజరాత్ మాజీ సీఎం శంకర్ సింగ్ వాఘేలా భేటీ అయ్యారు. ప్రగతి భవన్‌లో జరుగుతున్న సమావేశంలో దేశ రాజకీయాలు, జాతీయ అంశాల పై ఇరువురు నేతలు చర్చించిన్నట్లు తెలుస్తోంది. బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్న కేసీఆర్... ఇప్పటికే ఇతర రాష్ట్రాల నేతలతో వరుసగా భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో వాఘేలా, కేసీఆర్ తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. శంకర్ సింగ్ వాఘేలా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈ ఏడాది చివరలో గుజరాత్ లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లుగా ఆయన వెల్లడించారు.

## బిజెపిలో చేరనున్న కెప్టెన్ అమరీందర్ సింగ్

**చండీఘడ్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ 19న సోమవారం బీజేపీలో చేరనున్నారు. 18న ఢిల్లీకి వెళ్లనున్న ఆయన.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో పార్టీలో చేరనున్నారు. తన పార్టీ పంజాబ్ లోక్ కాంగ్రెస్ (పిఎల్‌సి)ని కూడా బీజేపీలో విలీనం చేసే చాన్స్ ఉంది. ఈవిషయాన్ని పీఎల్‌సీ అధికార ప్రతినిధి ప్రిత్పాల్ సింగ్ బలియావాల్ ధ్రువీకరించారు. కెప్టెన్‌తో పాటు ఆయన కుమారుడు రణ్ ఇందర్ సింగ్, కుమార్తె ఇందెర్ కౌర్, మనుమడు నిర్వాణ్ సింగ్ కూడా బీజేపీలో చేరనున్నారు. అమరీందర్ సింగ్ గతేడాది కాంగ్రెస్ ను వీడి పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, శిరోమణి అకాలీ దళ్ (సంయుక్త్)తో పొత్తు పెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగారు. కానీ ఆ ఎన్నికల్లో అమరీందర్ సింగ్ తో పాటు ఆ పార్టీ అభ్యర్థులంతా ఓడిపోయారు.

## రాజకీయాల కోసమే కెసిఆర్ ఉత్సవాలు

మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** కేసీఆర్ రాజకీయాల కోసం ఉత్సవాలను మారుస్తున్నారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగులను భయపెట్టి బలవంతంగా ఉత్సవాలు చేయిస్తున్నారని.. 8 ఏళ్లుగా కేసీఆర్ పాలన నిజాం పాలనను తలపిస్తోందని ఆరోపించారు. జిల్లా జైలును మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17 సమైక్యతా దినం కాదు విమోచన దినం అన్నారు. రజాకార్ల నుంచి విముక్తి అయిన రోజు సెప్టెంబర్ 17 అని గుర్తు చేశారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించాలని.. ఇంగ్లండ్‌లో చదివిన అసదుద్దీన్‌కు తెలంగాణ ఉద్యమం గురించి ఏం తెలుసు అని ప్రశ్నించారు. తెలంగాణ కోటి రతనాల వీణను కేసీఆర్ కోటి అబద్దాల ముఠాగా మార్చారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

# అంబేడ్కర్ పేరు వెనక రాజకీయ దురుద్దేశ్యం



కెసిఆర్ వల్లనే దళితులకు అన్యాయం

మందకృష్ణ మాదిగ విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** తెలంగాణ కొత్త సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం వెనుక ఓట్లు దండుకునే రాజకీయం ఉందని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆరోపించారు. దళితులకు కేసీఆర్ వల్లే అన్యాయం జరుగుతోందన్నారు. గతంలో దళితున్ని సీఎం చేస్తానని కేసీఆర్ మాట తప్పారని.. కొత్త రాజ్యాంగం రాయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని కేసీఆర్ వ్యాఖ్యానించిన సందర్భంలో తెలంగాణ దళిత ఎమ్మెల్యేలు ఎందుకు మౌనంగా వహించారో సమాధానం చెప్పాలన్నారు. చదువుకు దళితులు, బీసీలను దూరం చేయడానికే ప్రైవేట్ వర్సిటీలను రాష్ట్రానికి కేసీఆర్ తెచ్చారని మందకృష్ణ పేర్కొన్నారు. ప్రకృతి వనాలు, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల పేరిట ఉమ్మడి రాష్ట్రంలో దళితులకు ఇచ్చిన భూములనూ కేసీఆర్ ప్రభుత్వం వెనక్కు లాక్కుందన్నారు. తెలంగాణ ఏర్పడితే దళిత, గిరిజనులకు 3 ఎకరాలు చొప్పున భూమిని ఇస్తానని చెప్పిన కేసీఆర్.. ఎక్కడ ఇచ్చారని మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. 'పేదలకు అన్నం పెట్టేది రాజ్యాంగం ..సంస్థలకు పేర్లు పెడితే కడుపు నిండదు' అని ఆయన కామెంట్ చేశారు.

# కంటోన్మెంట్ ఉత్సవాల్లో నేతల కక్కుర్తి



విద్యార్థులకు పాచిన ఆహారం పెట్టడంపై విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** జాతీయ సమైక్యత దినోత్సవాల లో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎమ్మెల్యే సాయన్న ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో అపశృతి చోటు చేసుకుంది. వేడుకలలో పాల్గొన్న విద్యార్థులకు కుళ్ళిపోయి దుర్వాసనతో కూడిన భోజనాన్ని సరఫరా చేశారు. కుళ్ళిపోయిన వాసన వస్తుండడంతో విద్యార్థులు కొద్దిగా తిని వదిలేశారు. ఎండలో ర్యాలీలో తిప్పి వారికి పాచిపోయిన ఆహారం పెట్టడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం లక్షల డబ్బులు కేటాయించగా స్థానిక నేతల కక్కుర్తి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై తేరుకున్న నేతలు అధికారులు వాటిని గుట్టుచప్పుడు కాకుండా డస్ట్ బిన్‌లోకి తరలించారు. ఎవరి కంటపడకుండా విద్యార్థులను కూడా పంపించారు.

# విదేశాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్య, విద్య




జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో మారిన పరిస్థితులు

మెడ్‌ఎక్స్‌పో కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు

**సిద్దిపేట, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** వైద్య విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాల కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గతంలో వైద్యవిద్య కోసం ఉక్రెయిన్, రష్యాకు వెళ్లి చదువుకునే వారని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజి ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన మెడ్‌ఎక్స్‌పో కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సిద్దిపేటలో రూ.15 కోట్లతో క్యాథలాబ్ గుండె చికిత్స, రేడియో థెరపీ సేవలకు అనుగుణంగా క్యాన్సర్ చికిత్స అందిస్తామన్నారు. సిద్దిపేటలో 900 పడకల దవాఖానను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. మూడేండ్ల నుంచి కరోనా వల్ల ఎక్కడా మెడ్ ఎక్స్‌పో జరగలేదని వెల్లడించారు. రానున్న రోజుల్లో బీ కేటగిరీలో లోకల్ రిజ్వేషన్లు అమలు చేస్తామని, పీజీ సీట్లను 40 వరకు పెంచుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో సిద్దిపేటలో రూ.15కోట్లతో క్యాత్ లాబ్ గుండె చికిత్సలు అందిస్తామని మంత్రి హరీష్‌రావు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జరుగుతున్న మెడ్ ఎక్స్ పో కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి... విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనను తిలకించారు. వైద్య విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాల కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. రేడియో థెరపీ సేవలకు అనుగుణంగా క్యాన్సర్ చికిత్స అందిస్తామన్నారు. 900 బెడ్స్ హాస్పిటల్ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూడేళ్ల నుండి కరోనా వల్ల ఎక్కడా మెడ్ ఎక్స్ పో జరగలేదన్నారు. రానున్న రోజుల్లో బి కేటగిరీల్లో లోకల్ రిజ్వేషన్ అమలు చేస్తామని, పీజీ సీట్లను 40 వరకు పెంచుతున్నామని మంత్రి హరీష్ రావు వెల్లడించారు.

# వాతావరణ మార్పులతో పుడమికి తక్షణ ముప్పు

ట్విట్టర్ వేదికగా మంత్రి కెటిఆర్ ఆందోళన



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** ట్విటర్‌లో యాక్టివ్‌గా ఉండే రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తాజాగా పర్యావరణంపై ఓ ట్వీట్ చేశారు. వాతావరణ మార్పులపై ట్విటర్ వేదికగా స్పందించారు. వాతావరణ మార్పులతో పుడమికి తక్షణ ముప్పు పొంచి ఉందని అన్నారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటారు. ముఖ్యంగా ట్విటర్‌లో కేటీఆర్ చాలా యాక్టివ్. ట్విటర్ వేదికగా వచ్చే ఫిర్యాదులు, రిక్వెస్టులపై కేటీఆర్ స్పందిస్తారు. తక్షణమే సంబంధిత శాఖలకు ఆ రిక్వెస్ట్‌ను పంపించి చర్యలకు ఆదేశిస్తారు. ఇక ట్విటర్ వేదికగా కేంద్రం, మోదీ సర్కార్, ప్రతిపక్ష విపక్షాలపై కేటీఆర్ తీవ్రంగా మండిపడతారు. చాలాసార్లు ఇతర పార్టీ నేతలకు కేటీఆర్‌కు మధ్య ట్వీట్ వార్‌లు కూడా నడిచాయి. ఇవే కాకుండా అప్పుడప్పుడు తన మనసుకు నచ్చిన విషయాలను కూడా షేర్ చేస్తుంటారు. ప్రజాసంక్షేమం, పర్యావరణం, ప్రకృతి, కళలపై కూడా అప్పుడ ప్పుడు కేటీఆర్ ట్వీట్ చేస్తారు. తాజాగా అలాగే ఓ ట్వీట్ చేశారు. ‘వాతావరణ మార్పులు తరచూ జరగకుండా.. సమతుల్యంగా ఉండాలంటే.. ఈ పుడమిని రక్షించుకోవాలంటే.. 'తెలంగాణ అటవీ విశ్వవిద్యాలయం' తరహా కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ అన్నారు. సుస్థిరాభివృద్ధి, చెట్లపెంపకంపై భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.

# నీలి విప్లవానికి నాంది పలికిన సిఎం కెసిఆర్

మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటుతో భరోసా

ఎస్సారెస్పీలో చేపపిల్లలను వదిలిన మంత్రి ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ సరికొత్త నీలి విప్లవానికి నాందిపలికారని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో మత్స్యకారుల అభివృద్ధి జరిగిందని, సీఎం నిర్ణయంతో ప్రతి వృత్తిదారుని ఇంట్లో సంబురం నెలకొందని చెప్పారు. మత్స్యకారులకు ఆదాయం భారీగా పెరిగిందన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ నాగపూర్ పాయింట్ వద్ద 62.86 లక్షల ఉచిత చేప పిల్లలను మంత్రి వదిలారు. అనంతరం మాట్లాడుతూ.. చేప పిల్లలు విడుదల చేసే క్రమంలో నూతనంగా చేపపిల్లలను లెక్కించే యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీంతో చేప పిల్లల విడుదలలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదన్నారు. ఏ దళారీ ప్రమేయం లేకుండా.. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా చేప పిల్లల పంపిణీ జరుగుతుందని మంత్రి చెప్పారు. మత్స్యకారులనే ఇందులో భాగస్వామ్యం చేయడంతో వందల కోట్ల సంపద సృష్టి జరిగి వృత్తి దారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయంతో సంపద సృష్టి పట్ల దేశంలోని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 1043 చెరువుల్లో 4.85 కోట్ల చేప పిల్లలు విడుదలకు ప్రణాళిక చేశామన్నారు. వీటి ద్వారా సుమారు రూ.500 కోట్ల సంపద సృష్టి జరగనుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత దంపతులకు బెయిల్

సిబిఐ ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు ◆ తదుపరి విచారణ డిసెంబరు 16కు వాయిదా



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టుఅరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, ఆమె భర్త పి.రామకోటేశ్వరరావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం.. సీబీఐ కోర్టు తీర్పు అమలు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపల్లి గీత కేసు తదుపరి విచారణ డిసెంబరు 16కు వాయిదా వేసింది. బ్యాంకును మోసం చేశారన్న కేసులో కొత్తపల్లి గీతకు ఇప్పటికే సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. సీబీఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. కొత్తపల్లి గీత దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకును బ్యాంకును మోసం చేశారన్న కేసులో అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇటీవల ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించింది. రుణాల పేరిట పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.42 కోట్లు మోసం చేశారన్న కేసులో కొత్తపల్లి గీత, ఆమె భర్త రామకోటేశ్వరరావు, తదితరులను సీబీఐ కోర్టు దోషిగా తేల్చింది. కొత్తపల్లి గీత, ఆమె భర్త పి.రామకోటేశ్వరరావు డైరెక్టర్లుగా ఉన్న విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ గతంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రుణాలు పొందింది. అయితే బ్యాంకు అధికారులతో కుమ్మక్కై తప్పుడు డాక్యుమెంట్లతో రుణాలు పొంది వాటిని ఇతర అవసరాలకు దారి మళ్లించి మోసం చేశారని అభియోగం.పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు కొత్తపల్లి గీత, పి.రామకోటేశ్వరరావు, విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు బీకే జయప్రకాశన్, కేకే అరవిందాక్షన్, డాక్యుమెంట్లు తయారు చేసిన ఎస్.రాజ్‌కుమార్‌పై బెంగళూరులోని సీబీఐ బ్యాంకింగ్ నేరాల విభాగం కేసు నమోదు చేసింది. దర్యాప్తు చేసి నిందితులపై 2015లో హైదరాబాద్ సీబీఐ కోర్టులో సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. విచారణ జరిపిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం.. వివిధ సెక్షన్ల ప్రకారం నిందితులందరూ నేరానికి పాల్పడినట్లు తేలుస్తూ నిన్న తీర్పు వెల్లడించింది. కొత్తపల్లి గీత దంపతులకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించిన కోర్టు.. వారితో పాటు బ్యాంకు అధికారులు జయప్రకాశన్, అరవిందాక్షన్‌కూ ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రాకు రూ.2 లక్షల జరిమానా విధించింది.కోర్టు జైలు శిక్ష విధించడంతో వెంటనే సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తపల్లి గీత అస్వస్థతకు గురి కావడంతో నిన్న ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చించారు. ఇవాళ వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో కొత్తపల్లి గీతను సీబీఐ అధికారులు చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు. మిగతా నలుగురు పి.రామకోటేశ్వరరావు, బీకే జయప్రకాశన్, కేకే అరవిందాక్షన్, ఎస్.రాజ్‌కుమార్ చంచల్‌గూడ జైలులో ఉన్నారు. 2014లో వైకాపా తరపున అరకు ఎంపీగా గెలుపొందిన కొత్తపల్లి గీత.. తర్వాత ఆ పార్టీని వీడారు. 2018లో జనజాగృతి పేరిట రాజకీయ పార్టీని నెలకొల్పారు. అనంతరం ఆమె భాజపాలో చేరి.. తన పార్టీనీ అందులో విలీనం చేశారు.

## మునుగోడు ఎన్నికపై కాంగ్రెస్ దూకుడు

ప్రచార కమిటీ కన్వీనర్‌గా దామోదర్ రెడ్డి నియామకం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక స్ట్రాటజీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్‌గా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మాణిక్కం ఠాగూర్ నియమించారు. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయన్నారు. రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ గా ఉన్న మధుయాష్కీని గత నెల 2వ తేదీన ఏడుగురు సభ్యులతో స్ట్రాటజీ అండ్ క్యాంపెయిన్ కమిటీ కి కన్వీనర్ గా ఏఐసీసీ నియమించింది. ఇందులో రాంరెడ్డి దామోదర్ రెడ్డి, బలరాం నాయక్, సీతక్క, అంజన్ కుమార్ యాదవ్, సంపత్ కుమార్, అనిల్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. అయితే స్థానిక నేతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో కన్వీనర్ బాధ్యతలను రాంరెడ్డి దామోదర్ రెడ్డికి అప్పగించారు. మునుగోడు ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పదవికి రాజీనామా చేయడంతో అనివార్యంగా ఉప ఎన్నిక ఏర్పడింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరారు. ఇటు కాంగ్రెస్ నుంచి ఉప ఎన్నిక బరిలో పాల్వాయి స్రవంతి ఉన్నారు. ఎలాగైనా ఉప ఎన్నికలో గెలిచి తీరాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.

# గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారత్

కరోనా, ఉక్రెయిన్ యుద్ధంతో సరఫరా వ్యవస్థకు దెబ్బ

సరఫరా వ్యవస్థల ద్వారా దేశాల మధ్య అనుసంధానం

ఎస్‌సీవో సదస్సులో ప్రధాని మోడీ ఉద్ఘాటన

వచ్చే ఏడాది సదస్సుకు సహకరిస్తామన్న జిన్‌పింగ్

మోడీ, జిన్‌పింగ్‌ల పరస్పర అభినందనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (సమ సమాజం):** మెరుగైన సరఫరా ద్వారా దేశాల మధ్య అనుసంధానతను సాధించ వచ్చని ఎస్‌సిఒ సభ్య దేశాలకు ప్రధాని మోడీ సూచించారు. ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌లో 22వ షాంఘై సహకార సదస్సు ఎస్‌సిఒలో శుక్రవారం మోడీ సభ్యదేశాలనుద్దేశించి ప్రసంగించారు. కరోనా మహమ్మారి, ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ సరఫరా గొలుసులు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం సంక్షోభం ఏర్పడిందని అన్నారు. ఈ సంక్షోభాలను ఎదుర్కొనేందుకు సభ్యదేశాలు అనుసంధానతను సాధించేందుకు మెరుగైన సరఫరా కలిగి ఉండాలని సూచించారు. సభ్య దేశాల మధ్య సహకారానికి, పరస్పర విశ్వాసానికి భారత్ మద్దతునిస్తుందని అన్నారు. ఆహార భద్రతకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా, చౌకగా లభించే చిరుధాన్యాలను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు భారత్ కృషి చేస్తోందని అన్నారు. సాంప్రదాయక వైద్యంలో కూడా సభ్య దేశాలు సహకరించాలని కోరారు. ప్రజాభివృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న వినియోగంపై దృష్టి సారించామని, ఎస్‌సిఒ దేశాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.5 శాతానికి చేరుకుంటుందని అంచనావేస్తున్నామని, ప్రపంచ ఆర్థికవ్యవస్థలలో ప్రధానంగా నిలుస్తుం దని అన్నారు. ప్రజల కేంద్రంగా అభివృద్ధి విధానాన్ని అమలు చేయడంపై తాము దృష్టి పెట్టామని తెలిపారు. ప్రతి రంగంలోనూ సృజనాత్మకత, నవకల్పనలకు మద్దతిస్తున్నామని, సహకరిస్తున్నామని చెప్పారు. భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చేదిశగా కృషి చేస్తున్నామని, ప్రతిరంగంలో ఆవిష్కరణకు మద్దతు ఇస్తున్నామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో 70వేల కంటే అధిక స్టార్టప్‌లు, 100యునికార్న్‌లు ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో షాంఘై సహకార సంఘం పాత్ర ప్రాధాన్యం పెరుగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. దేశాల మధ్య సహకారం మరింత పెరగవలసిన అవసరం ఉందని తెలిపారు. భారత దేశాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. నేడు ప్రపంచం కోవిడ్-19 మహమ్మారిని అధిగమిస్తోందని, ఈ సమయంలో ఎస్‌సీఓ పాత్ర చాలా ముఖ్యమైనదని తెలిపారు. ఎస్‌సీఓ సభ్య దేశాల్లో ప్రపంచ జనాభాలో 40 శాతం నివసిస్తోం దన్నారు. ప్రపంచ జీడీపీలో 30 శాతం వాటా ఈ దేశాలదేనని చెప్పారు. ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య సహకారాన్ని భారత్ సమర్థిస్తుందన్నారు. కోవిడ్-19 మహమ్మారి, ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచ సరఫరా వ్యవస్థలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనివల్ల ప్రపంచం మునుపెన్నడూ లేని స్థాయిలో ఇంధనం, ఆహార సంక్షోభాలను ఎదుర్కొంటోందని చెప్పారు. వైవిధ్యభరితమైన సరఫరా వ్యవస్థలను ఎస్‌సీఓ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దీని కోసం మెరుగైన అనుసంధానం మాత్రమే చాలదని, మెరుగైన రవాణా సదుపాయాలు అవసరమని చెప్పారు. ప్రజల కేంద్రంగా అభివృద్ధి విధాన్ని అమలు చేయడంపై తాము దృష్టిపెట్టామని తెలిపారు. ప్రతి రంగంలోనూ సృజనాత్మకత, నవకల్పనలకు మద్దతిస్తున్నామని, సహకరిస్తున్నామని చెప్పారు. నేటికి భారత దేశంలో 100కుపైగా యూనికార్న్‌లు, 70,000కుపైగా స్టార్టప్ కంపెనీలు ఉన్నాయని చెప్పారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి ఇచ్చిన ట్వీట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, ఎస్‌సీఓ సభ్య దేశాల అధినేతలతో ప్రధాని మోదీ చర్చలు జరిపారు. అంశాలవారీగా, ప్రాంతీయ, జాతీయ సమస్యలపై ఈ చర్చలు జరిగాయి. ప్రాంతీయ శాంతి, భద్రతలు, వ్యాపారం, వాణిజ్యం, అనుసంధానం, సంస్కృతి, పర్యాటక రంగాలపై చర్చలు జరిగాయి. 28 నెలల క్రితం తూర్పు లడఖ్‌లో భారత్-చైనా మధ్య ప్రతిష్టంభన ఏర్పడిన సంగతి తెలిసిందే. జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలిపారు.




# చలన చిత్రం

## ఆస్కార్ పోటీలో ఆర్ఆర్ఆర్





ఈ ఏడాది ఇండియా నుండి గొప్ప చిత్రాల లిస్ట్ తీస్తే, అందులో 'ఆర్ఆర్ఆర్' మొదటి స్థానంలో ఉంటుంది. దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కించిన ఈ అద్భుత దృశ్యకావ్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. 'బాహుబలి'తో టాలీవుడ్ స్టాయిని పెంచిన రాజమౌళి.. 'ఆర్ఆర్ఆర్'తో ఏకంగా ఇండియన్ సినిమా స్థాయిని పెంచాడు. ముఖ్యంగా హాలీవుడ్‌లో సినీ ప్రముఖులు ఇండియన్ సినిమా గురించి గొప్పగా మాట్లాడుకునేలా చేశాడు. హాలీవుడ్ దర్శకులు, టెక్నీషియన్లు సైతం 'ఆర్ఆర్ఆర్' గురించి గొప్పగా వర్ణించారు. ఇక ఈ చిత్రంలో తారక్, రామ్‌చరణ్ నటనకైతే పరవశించని ప్రేక్షకుడు లేడు. ఇద్దరి నటనను వెండితెరపై చూడటానికి రెండు కళ్ళు చాలలేవు అన్నంతలా వాళ్ళ నటనతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నారు. ఇక ఇటీవలే అమెరికాకు చెందిన ప్రముఖ మూవీ పబ్లికేషన్స్ వారు ఆస్కార్-2023కి గాను ఉత్తమ నటుడు కేటగిరీలో జూ.ఎన్టీఆర్‌కు అవార్డు వచ్చే ఛాన్స్ ఉందని లిస్ట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా తాజాగా చరణ్‌కు కూడా ఆస్కార్ గెలిచే ఛాన్స్ ఉందని లిస్ట్‌లో ప్రచురించారు. ఈ లిస్ట్‌లో తారక్ 35వ ప్లేస్‌లో ఉండగా..చరణ్ 36వ ప్లేస్ ఉన్నాడు. అంతేకాకుండా బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కెటగిరిలో 'దోస్తీ' పాటకు కూడా ఆస్కార్ వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. దీనిపై ఇండియన్ ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడింటిలో ఒక్క దానికి ఆస్కార్ వచ్చిన అది గర్వకారణమే అవుతుందని కామెంట్స్ చేస్తున్నారు. ఈ చిత్రంలో తారక్ కొమురం భీమ్ పాత్రలో నటించగా, రామ్ చరణ్ అల్లూరి సీతారామరాజు పాత్రలో నటించాడు. బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగన్ కీలకపాత్రలో నటించాడు. భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో అలియాభట్, ఒలీవియా మొర్రీస్‌లు కథానాయికలుగా నటించారు.




## రెండు సినిమాలతో రాబోతున్న రకుల్

ఈ మధ్యనే 'కట్‌పుత్‌లీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. త్వరలో మరో రెండు సినిమాలతో రాబోతోంది. అజయ్ దేవగన్, సిద్దార్థ్ మల్హోత్రాలతో కలిసి రకుల్ నటించిన 'థ్యాంక్ గాడ్' మూవీ అక్టోబర్ 25న విడుదల కాబోతోంది. ఇందులో రకుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఆమె లుక్ ఆకట్టుకుంది. రీసెంట్‌గా విడుదలైన ట్రైలర్ కూడా ఇంటరెస్టింగ్‌గా ఉండటంతో ఈ సినిమా కోసం రకుల్ ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఇంతలోనే ఆమె యాక్ట్ చేసిన మరో మూవీ రిలీజ్‌కి రెడీ అయిపోయింది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా అనుభూతి కశ్యప్ తెరకెక్కిస్తున్న 'డాక్టర్ జి'లో ఫిమేల్ లీడ్‌గా నటించింది రకుల్. ఆయుష్మాన్ గైనకాలజిస్ట్‌గా కనిపించనున్నాడు. రకుల్ మెడికల్ స్టూడెంట్ పాత్రను పోషించింది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 14న విడుదల చేసేందుకు మేకర్స్ నిర్ణయించుకున్నారు. త్వరలోనే అఫీషియల్‌గా అనౌన్స్ చేయబోతున్నారు. అంటే ఒకే నెలలో.. పది రోజుల గ్యాప్‌లో.. రెండు సినిమాలతో విజువల్ ట్రీట్ ఇవ్వబోతోంది రకుల్.



## 23న వస్తున్న దొంగలున్నారు జాగ్రత్త

మత్తువదలరా, తెల్లవారితే గురువారం చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్న కీరవాణి కొడుకు శ్రీ సింహా.. ఈసారి 'దొంగలున్నారు జాగ్రత్త' అంటూ వస్తున్నాడు. సతీష్ త్రిపుర దర్శకుడు. ప్రీతి అస్రాని హీరోయిన్. సురేష్ బాబు, సునీత తాటి నిర్మించారు. సెప్టెంబర్ 23న సినిమా రిలీజవుతున్న సందర్భంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. సింహా మాట్లాడుతూ 'కెరీర్ స్టార్టింగ్‌లోనే ఇలాంటి సబ్జెక్ట్ రావడం లక్కీ. తెలుగులో ఈ జానర్ సినిమా ఎవరూ చేయలేదు' అన్నాడు. 'నాకిది స్పెషల్ ఫిల్మ్. ఇలాంటి స్క్రిప్ట్ నేనెప్పుడూ వినలేదు. ప్రేక్షకులు కూడా ఎప్పుడూ చూసి ఉండరు. నీరజ అనే స్టాం÷-రగ్ క్యారెక్టర్‌లో కనిపిస్తాను. మహిళలంతా నా పాత్రకి కనెక్టవుతారు' అంది ప్రీతి. సతీష్ మాట్లాడుతూ 'రామానాయుడు ఫిల్మ్ స్కూల్‌లో చదువుకుని ఇదే బ్యానర్‌లో దర్శకుడిగా పరిచయమవడం హ్యాపీ. సురేష్ బాబు చాలా సపోర్ట్ చేశారు. సునీత బ్యాక్‌బోన్‌గా నిలిచారు. తెలుగులో ఫస్ట్ సర్వైవల్ థ్రిల్లర్ ఇది. సింగిల్ లొకేషన్‌లో షూట్ పూర్తి చేశాం' అన్నాడు. అందరికీ కొత్త అనుభూతినిచ్చే అద్భుతమైన సినిమా అన్నారు సునీత.




## ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నా: రాజమౌళి

స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి ఇటీవలే టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కు హాజరైన సంగతి తెలిసిందే. ఈవెంట్‌లో మీడియాతో ముఖాముఖిలో ఆర్ఆర్ఆర్‌కు ప్రపంచస్థాయి ఆదరణ, ఇతర అంశాలపై మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ ప్రపంచస్థాయిలో బ్లాక్ బాస్టర్ హిట్‌గా నిలిచినప్పటికీ.. తాను ఇంకా తొలి అడుగులోనే ఉన్నానని అన్నాడు. నేను ఇప్పటికీ తన కథనం, కథన శైలికి కట్టుబడి ఉన్నా. నన్ను నేను నిరంతం చక్కదిద్దుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు. నా స్టైల్ కథనంతో పాశ్చాత్య ధోరణిలో సాగే సినిమా చేస్తే..ఇక రెండు పడవల మీద ప్రయాణించినట్టే అవుతుందని అన్నాడు. తాను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉన్నందువల్ల తానింకా మార్గదర్శకుడిని కాదని చెప్పుకొచ్చాడు. రాజమౌళి ప్రస్తుతం మహేశ్ బాబుతో చేయబోయే సినిమాపై ఫోకస్ పెట్టాడు. వరల్డ్ వైడ్ యాక్షన్ అడ్వెంచర్ ప్రాజెక్టుగా వస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సెట్స్ పైకి వెళ్లనుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in